
10 YEAR ANNIVERSARY 2014 - 2024
# పెన్ పవర్
తెలంగాణ రౌండప్
ఆదివారం 2 మార్చి 2025 పేజీలు 8

# నామినేటెడ్ జాతర

## సీఎం ప్రకటనతో జిల్లాల్లో మొదలైన సందడి



- స్థానిక ఎమ్మెల్యేల వద్దకు ఆశావహుల క్యూ
- మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోస్టులకు డిమాండ్
- దేవాలయ కమిటీల కోసం ప్రయత్నాలు స్టార్ట్
- గ్రంథాలయ, వక్ఫ్, ఆత్మ కమిటీలకు కూడా..
- ఈ పోస్టులు భర్తీ చేశాకే లోకల్ బాడీ ఎన్నికలకు..

**హైదరాబాద్ పెన్ పవర్:**నామినేటెడ్ పోస్టులను ఈ నెల 10 లోగా భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడంతో జిల్లాల్లో సందడి మొదలైంది. ఖాళీగా ఉన్న రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులతో పాటు జిల్లా స్థాయి పదవులనూ భర్తీ చేయనున్నారు. సీఎం ప్రకటనతో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పదవులు ఆశిస్తున్న వారు ఎమ్మెల్యేల వద్దకు క్యూ కడుతున్నారు. జిల్లాల్లో మార్కెట్ కమిటీ పాలక వర్గాలు, దేవాలయాల కమిటీలతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్, డైరెక్టర్ పదవులు ఉంటాయి. వీటితోపాటు వక్ఫ్ బోర్డు జిల్లా పాలక వర్గాలు, ఆత్మ కమిటీలు, అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీల పాలక వర్గాలను నామినేషన్ పద్ధతిలో భర్తీ చేసుకునే అవకాశం ఉంది. దీంతో ద్వితీయ శ్రేణి నాయకులు స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల వద్దకు క్యూ కడుతున్నారు.

-3లో

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులకు..! ప్రభుత్వం శుభవార్త..




- ఈనెల 30 లోగా క్రమబద్ధీకరణ రుసుము చెల్లించిన వారికి 25 శాతం రాయితీ..
- మున్సిపల్ కమిషనర్‌లకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు..

- స్వయంగా సంబంధిత అధికారులే ఫోన్‌లు చేసి తెలియజేయాలని కలెక్టర్ సూచన..
- సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో జిల్లా కలెక్టర్ హాజరు..
- క్రమబద్ధీకరణకు అర్హత కలిగిన దరఖాస్తు లను పరిశీలించి ఫోన్‌లు చేయండి:కలెక్టర్..

-2లో

# హైడ్రా భయాన్ని క్యాష్ చేసుకుంటున్న కేటుగాళ్లు..

## డబ్బు చెల్లిస్తే ఇళ్లు కూల్చరని వసూళ్ల దందా



**హైదరాబాద్ పెన్ పవర్:**చెరువు, కుంటలను కాపాండేందకు ఏర్పాటైన హైడ్రా.. ఆక్రమణ దారులపై ఉక్కుపాదం మోపుతోంది. అక్రమ కట్టడాలను నిర్దాక్షిణ్యంగా కూల్చి వేస్తుండంతో చాలా మందిలో హైడ్రా భయం అక్కడో ఇక్కడో ఉంది. ఈ భయాన్నే క్యాష్ చేసుకుంటున్నారు కొందరు. అధికారులకు డబ్బులు ఇస్తే ఇళ్లు, అక్రమ కట్టడాలు కూల్చరని వసూళ్ల దందా మొదలు పెట్టారు. తాజాగా హైదరాబాద్ అమీన్ పూర్ పెద్ద చెరువు ముంపు బాధితుల నుంచి వసూళ్ల దందాకు దిగారు.

-2లో

# కొచ్చి విమానాశ్రయం తరహాలో మామునూరు ఎయిర్‌పోర్టు ఉండాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఎయిర్‌పోర్టుపై సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. భూసేకరణ, పెండింగ్ పనుల వివరాలు ఆరా తీశారు. కేరళలోని కొచ్చి విమానాశ్రయం తరహాలో మామునూరు విమానాశ్రయం ఉండాలని సూచించారు. నిత్యం యాక్టివిటీ ఉండేలా ఎయిర్‌పోర్టు డిజైన్ చేయాలన్నారు. విమానాశ్రయానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. పనులకు సంబంధించి ప్రతీ నెలా రిపోర్టు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు కడియం కావ్య, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీహరి, ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, మేయర్ సుధారాణి, సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, శ్రీనివాసరాజు హాజరయ్యారు.




# యాదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- మార్చి 11వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు
- ఆలయ గోపురానికి బంగారు తాపడం అనంతరం మొదటి బ్రహ్మోత్సవాలు
- గర్భాలయంలోని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు

**హైదరాబాద్ పెన్ పవర్:**యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. నిన్న ప్రారంభమైన ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 11వ తేదీ వరకు జరుగుతాయి. ఆలయ గోపురానికి బంగారు తాపడం అనంతరం వచ్చిన బ్రహ్మోత్స వాలు

-2లో





మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు..

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులకు..! ప్రభుత్వం శుభవార్త..

- ఈనెల 30 లోగా క్రమబద్ధీకరణ రుసుము చెల్లించిన వారికి 25 శాతం రాయితీ..
- మున్సిపల్ కమిషనర్‌లకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు..



- స్వయంగా సంబంధిత అధికారులే ఫోన్‌లు చేసి తెలియజేయాలని కలెక్టర్ సూచన..
- సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో జిల్లా కలెక్టర్ హాజరు..
- క్రమబద్ధీకరణకు అర్హత కలిగిన దరఖాస్తులను పరిశీలించి ఫోన్‌లు చేయండి:కలెక్టర్..

## రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు..

ఈ ఎండా కాలంలో నీటి ఎద్దడిని దరి చేరకుండా వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్ మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు.. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా జిల్లాలో ఉన్న బోర్లను మరమ్మత్తులు చేయించాలని, అవసరమైన చోట వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేసి ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు..

## స్పెషల్ డ్రైవ్ నిర్వహించండి..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు.. అవసరమైతే ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి త్వరితగతిన దరఖాస్తుల పరిశీలనను చేపట్టి ప్రతిరోజు క్రమబద్ధికరణ దరఖాస్తులపై పురోగతిని మెస్సేజ్ ద్వారా పంపాలని, అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు కారణాలు తెలపాలని సూచించారు.. దరఖాస్తు దారులు క్రమబద్ధీకరణ రుసుము చెల్లించేందుకు ఆన్‌లైన్ ద్వారా లేదా వార్డు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ల వద్ద చెల్లించే విధంగా వారికి మార్గనిర్దేశం చేయాలని సూచించారు..



మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి..




సమావేశంలో కలెక్టర్ గౌతమ్, డిఆర్వో హరిప్రియ..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 1:** ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలియజేసింది.. అర్హత కలిగిన దరఖాస్తుదారులు, ఈ నెల 30 లోగా క్రమబద్ధీకరణకు రుసుము చెల్లించినట్లయితే..! 25 శాతం రాయితీ వస్తుందని తెలపాలని, జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు ఆదేశించారు.. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ గౌతమ్ హాజరయ్యారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఎల్ఆర్ఎస్‌కై దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి..! క్రమబద్ధీకరణకు అర్హమైన దరఖాస్తులను ఎంచుకుని, వారికి సంబంధిత అధికారులు స్వయంగా ఫోన్ ద్వారా, ఈ నెల 30లోగా క్రమబద్ధీకరణ రుసుము చెల్లించినట్లయితే ప్రభుత్వం 25 శాతం రాయితీ అందిస్తుందనే విషయాన్ని దరఖాస్తు దారులకు తెలపాలని, జిల్లాలోని మున్సిపల్ కమీషనర్‌లు అందరూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.. జిల్లాలోని ఒక్కో మున్సిపాలిటి వారిగా ఎన్ని దరఖాస్తులు వచ్చాయని, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు..

## యాదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- మొదటి పేజి తరువాయి

ఇవి. ఈ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. మొదటిరోజు శ్రీ విష్వక్సేనారాధన, స్వస్తివాచనం, రక్షాబంధనం పూజలు, వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదట గర్భాలయంలోని స్వయంభు నారసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు.

## హైడ్రా భయాన్ని క్యాష్ చేసుకుంటున్న కేటుగాళ్లు.. డబ్బు చెల్లిస్తే ఇళ్లు కూల్చరని వసూళ్ల దందా

- మొదటి పేజి తరువాయి

అమీన్‌పూర్ పెద్ద చెరువు ముంపు బాధితుల జేఏసీలో సభ్యులు కావాలంటే రూ. వేయి చెల్లించాలని.. తర్వాత గజానికి 500ల చొప్పున చెల్లిస్తే ప్రభుత్వ శాఖలలో సర్దుబాట్లు చేయాల్సి ఉంటుందని చెబుతూ వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో హైడ్రా అధికారులను మేనేజ్ చేయొచ్చునని సామాన్యుల దగ్గర చందా వసూలు చేస్తుండటంపై పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీనిపై హైడ్రా స్పందించింది. అమీన్ పూర్ చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణపై హైడ్రా చేస్తున్న కసరత్తును ఆసరాగా తీసుకుని ఎవరైనా దందాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని కమిషనర్ హెచ్చరించారు. దందాలకు పాల్పడిన వారిపై పోలీసు స్టేషన్ లో ఫిర్యాదులు చేయాలని బాధితులకు హైడ్రా సూచించింది.

## నామినేటెడ్ జాతర: సీఎం ప్రకటనతో
# జిల్లాల్లో మొదలైన సందడి

- మొదటి పేజీ తరువాయి

పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి నిన్న జరిగిన సమావేశంలో క్లారిటీ ఇచ్చారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ సారి పదవుల కేటాయింపు ఆసక్తికరంగా మారింది. నామినేటెడ్ పదవులు పొందిన వాళ్లు స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సి ఉంటుంది. అలా సత్తా ఉన్న వారికే పదవులు దక్కే అవకాశం ఉందనే టాక్ ఉంది. ఎంపిక కూడా చాలా జాగ్రత్తగా సామాజిక సమీకరణాలు అంచనా వేస్తూ ఉండే అవకాశం ఉంది. ఏది ఏమైనా ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత జిల్లాల స్థాయిలో జరగబోయే నామినేటెడ్ పోస్టుల భర్తీకి ప్రాధాన్యం ఏర్పడింది

## ప్రకాశం జిల్లా ప్రజలకు జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి: మంత్రి నిమ్మల



హైదరాబాద్ పెన్ పవర్:అధికారం కోల్పోయినా అబద్ధాలు ఆడడంలో వైసీపీ నేతలు ఎక్కడా తగ్గడం లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ప్రజలకు మాయమాటలు చెప్పేందుకు వైసీపీ నేతలు పోటీపడుతున్నారని ఎద్దేవా చేశారు. పూర్తికాని వెలిగొండ ప్రాజెక్టును జగన్ ప్రజలకు ఎలా అంకితం చేశారో చెప్పాలని నిమ్మల నిలదీశారు. పూర్తికాని ప్రాజెక్టును ఆనాడు ఎలా ప్రారంభించారో వైసీపీ నేతలు చెప్పాలని అన్నారు. ప్రకాశం జిల్లా ప్రజలకు జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని మంత్రి నిమ్మల డిమాండ్ చేశారు. 2026 జులై నాటికి వెలిగొండ రిజర్వాయర్ ను నింపుతామని స్పష్టం చేశారు.


## నేను రాజీనామా చేసి, నా స్థానంలో మరొకరిని గెలిపించేందుకు సిద్ధం: కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్:రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వడానికి సామాజిక సమీకరణాలు అడ్డొస్తే తాను రాజీనామా చేసి, ఎవరినైనా గెలిపించేందుకు సిద్ధమని జిల్లాకు చెందిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లా కార్యకర్తలకు అన్యాయం చేయవద్దని, జిల్లా అభివృద్ధి కోసం అవసరమైతే తాను రాజీనామా చేయడానికి కూడా సిద్ధమేనని అన్నారు.జిల్లాలో మంత్రి ప్రాతినిధ్యం కోసం రాజీనామా చేయమంటే చేస్తానని వ్యాఖ్యానించారు. ఇటీవల పార్టీలోకి వచ్చిన వారికి మంత్రి పదవులు ఇచ్చారని వాపోయారు. పార్టీ కోసం కష్టపడిన వారిని పక్కన పెట్టడం సరికాదని ఆయన అన్నారు. పార్టీలోకి ఎవరైనా వస్తే గౌరవం ఇవ్వాలే కానీ, పదవులు కాదని అన్నారు. రాష్ట్రంలోనే అధిక జనాభా కలిగిన రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి రావాలని ఆయన అన్నారు.


# ఆ నలుగురు ఎక్కడ: ఎస్ ఎల్బీసీ టన్నెల్ శిథిలాల కింద వెతుకులాట

- 9 మీటర్ల లోతు బురదలో నలుగురి మృతదేహాలు
- రాడార్ సెన్సార్ తో గుర్తించిన బృందాలు
- రాత్రి వరకు వీళ్ల డెడ్ బాడీస్ బయటికి..
- రెస్క్యూ లో పాల్గొంటున్న 11 బృందాలు



హైదరాబాద్ పెన్ పవర్:ఎస్ ఎల్బీసీ టన్నెల్ లో శిథిలాల కింద గత శనివారం చిక్కుకున్న వారిలో నలుగురి ఆచూకీ లభ్యమైంది. 9 మీటర్ల లోతు బురదలో వీళ్ల డెడ్ బాడీస్ ఉన్నట్టు రెస్క్యూ బృందాలు గుర్తించాయి. మిగతా నలుగురు టీబీఎం ముందు భాగంలో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఓ ఊహా చిత్రాన్ని కూడా విడుదల చేశారు. ఆ చిత్రంలో నలుగురు వెనుకవైపు ఉండగా.. మిగతా నలుగురిలో ఇద్దరు ఒక దగ్గర, మరో ఇద్దరు కొంచం ముందుకు ఉన్నట్టుగా ఉంది. కొట్టుకు వచ్చిన టీబీఎం ను కటింగ్ చేసే పనులు కొనసాగుతున్నాయి. నలుగురు టీబీఎం వెనుక భాగంలో ఉండటంతో రాడార్ సెన్సార్ సాయంతో వారి మృతదేహాలను గుర్తించగలిగారు. ముందు వైపు నలుగురు ఉన్నట్టు గా రెస్క్యూ టీం భావిస్తోంది. దీంతో అక్కడికి చేరుకొని శిథిలాలను తొలగిస్తేనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. మిస్సయిన వారిలో ముందు భాగంలో ఎవరెవరున్నారు.. వెనుక వైపు ఎవరున్నారు అనేది క్లారిటీ రాలేదు. శిథిలాల కింద ఉన్న తమ వారి కోసం కుటుంబ సభ్యులు నిరీక్షిస్తున్నారు. ఎస్ఎల్బీసీ ఆఫీసు వద్ద పడిగాపులు కాస్తున్నారు.

# నాలుగు కాళ్లతో పుట్టిన కోడి పిల్ల.. బర్డ్ ఫ్లూ ఎఫెక్టేనా..?



హైదరాబాద్ పెన్ పవర్:బర్డ్ ఫ్లూ వల్ల జనం చికెన్ కొనడం మానేశారు.. కానీ, ఫ్రీగా చికెన్ పంపిణీ చేస్తే మాత్రం ఎగబడి తింటున్నారు జనం. బర్డ్ ఫ్లూ వల్ల జరుగుతున్న నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు పౌల్ట్రీ యజమానులు నిర్వహిస్తున్న ఫ్రీ చికెన్ మేళాకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇదిలా ఉండగా నాలుగు కాళ్లతో పుట్టిన వింత కోడి పిల్ల జనాన్ని భయపెడుతోంది.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగింది ఈ వింత.. ఓ కోడి పిల్ల నాలుగు కాళ్లతో పుట్టింది. వింతగా పుట్టిన ఈ కోడి పిల్లను చూడటానికి జనం ఎగబడుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు మండలం, రాఘబోయినగూడెం లో ఓ కోడి నాలుగు కాళ్లతో కోడి పిల్ల జన్మించింది. ఈసాల పగడయ్య అనే గిరిజన ఆదివాసి వ్యక్తి ఇంట్లో పది రోజుల క్రితంపుట్టింది ఈ వింత కోడి పిల్ల. 20 గుడ్లపై పొదిగిన కోడి 15 పిల్లలకు జన్మనిచ్చిందని... అందులో ఒక కోడి పిల్ల నాలుగు కాళ్లతో జన్మించిందని యజమాని తెలిపారు. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు ఈ అరుదైన సంఘటన పట్ల వింత జీవిగా భావించి జనం తండోపతండాలుగా వచ్చి చూస్తున్నారు. బర్డ్ ఫ్లూ తరహాలో కొత్త వైరస్ ఏమైనా వచ్చిందా అని కొంతమంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు .నాలుగు కాళ్లతో కోడి పిల్ల పుట్టడం పై భిన్న వాదనలు వినిపిస్తున్నారు. పశువైద్యులు ఈ కోడి పిల్లను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు గ్రామస్థులు.

# జేఎన్టీయూ-హెచ్ జాబ్ మేళాలో తోపులాట... పోలీసుల జోక్యం



- ఉద్యోగ మేళాను ప్రారంభించిన ఎంపీ ఈటల రాజేందర్
- కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ప్రారంభించినట్లు వైస్ ఛాన్సలర్ వెల్లడి
- సుమారు 90 కంపెనీలు ఉద్యోగ మేళాలో పాల్గొంటున్నాయని వెల్లడి

హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జేఎన్టీయూలో నిర్వహిస్తోన్న మెగా జాబ్ మేళాకు పెద్ద ఎత్తున అభ్యర్థులు హాజరయ్యారు. ఉద్యోగార్థులు పోటెత్తడంతో తోపులాట చోటు చేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఉద్యోగ మేళాకు మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. జేఎన్టీయూ హైదరాబాద్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఈ ఉద్యోగ మేళాను ఏర్పాటు చేశామని జేఎన్టీయూ-హెచ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కిషన్ కుమార్ రెడ్డి తెలిపారు. సుమారు 90 కంపెనీలు ఈ ఉద్యోగ మేళాలో పాల్గొంటున్నాయని చెప్పారు.

## వీహెచ్ నివాసంలో మున్నూరుకాపు నేతల సమావేశం... హాజరైన బీజేపీ, బీఆర్ఎస్ కీలక నేతలు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ మంత్రివర్గంలో మున్నూరుకాపులకు ప్రాధాన్యత లేకుండా పోయిందని, పార్టీల్లోనూ ప్రాధాన్యత కూడా దక్కడం లేదని ఆ సామాజిక వర్గం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హనుమంతరావు నివాసంలో మున్నూరు కాపు సామాజిక వర్గం నేతలు సమావేశమయ్యారు. ఈ భేటీకి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నుంచి కీలక నేతలు హాజరయ్యారు. మున్నూరు కాపు నేతలకు ప్రాధాన్యత దక్కడం లేదని పలువురు నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. కులగణనపై కృతజ్ఞత సభ పెడదామని కాంగ్రెస్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రతిపాదించారు. కులగణన సరిగ్గా చేయలేదని పలువురు మున్నూరు కాపు సామాజిక వర్గం నేతలు వ్యాఖ్యానించారు. మన సామాజిక వర్గం సంఖ్యను తగ్గించారని పేర్కొన్నారు. మంత్రివర్గంలో మున్నూరు కాపులకు ప్రాధాన్యత లేకపోవడం ఇదే తొలిసారి అన్నారు. నామినేటెడ్ పోస్టుల్లోనూ అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో మున్నూరు కాపుల సభను నిర్వహించాలని నేతలు నిర్ణయించారు.

## దాడులు చేసిన వారి చిట్టాను పింకు బుక్‌లో రాసుకుంటాం:

**హైదరాబాద్ పెన్ పవర్:** సమయం వచ్చినప్పుడు వారి సంగతి తేలుస్తామన్న కవిత. సింగోటం ఆలయానికి కేసీఆర్ రూ.17 కోట్లు మంజూరు చేశారన్న కవిత. ఆ నిధులను జూపల్లి కృష్ణారావు రద్దు చేశారని ఆరోపణ,

తమ పార్టీ నాయకులు కార్యకర్తలపై దాడులు చేసిన వారి చిట్టా పింకు బుక్‌లో రాసు కుంటామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. తమకు సమయం వచ్చినప్పుడు వారి సంగతిని తేలుస్తామని ఆమె హెచ్చరించారు. కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డితో కలిసి ఆమె మీడియాతో మాట్లాడుతూ, సింగోటం లింగాకార లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం కోసం గతంలో కేసీఆర్ రూ.17 కోట్లు మంజూరు చేస్తే, ఆ నిధులను జూపల్లి కృష్ణారావు రద్దు చేయడం దారుణమని పేర్కొన్నారు.

ఒక ప్రభుత్వంలో ఇచ్చినటువంటి పథకాలు తర్వాత ప్రభుత్వం కొనసాగించాలని అన్నారు. అప్పుడే ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. ప్రజల మీద కక్ష కట్టినట్లుగా దేవుడిపై కూడా కక్ష కట్టి రూ.17 కోట్లను రద్దు చేయించడం విడ్డూరమని అన్నారు. ఈ రద్దు చేసిన నిధులను తక్షణమే ఆలయ అభివృద్ధి కోసం ఉపయోగించాలని డిమాండ్ చేశారు.

కొల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ సామాజిక మాధ్యమంలో పోస్టులు పెడుతున్న బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని ఆమె అన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్త శ్రీధర్ రెడ్డిని హత్య చేశారని ఆరోపించారు. జూపల్లి కృష్ణారావు టూరిజం మంత్రిగా కాకుండా కొల్లాపూర్ నియోజకవర్గానికి అప్పుడప్పుడు వస్తూ టూరిస్ట్ మంత్రి గా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

# 31వ తేదీ తర్వాత ఆ వాహనాలకు పెట్రోల్, డీజిల్ కొట్టరు..

**హైదరాబాద్ పెన్ పవర్:** పాత వాహనాలకు ఇకపై పెట్రోల్, డీజిల్ కొట్టరు... షాక్ అయ్యారా, అవును నిజమే.. 15ఏళ్ళు పైబడిన పాత వాహనాలకు పెట్రోల్, డీజిల్ కొట్టద్దంటూ సంచలన నిర్ణయం తీసుకుంది ఢిల్లీ సర్కార్. ఈమేరకు ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిదర్ సిర్సా కీలక ప్రకటన చేశారు. మార్చి 31వ తేదీ తర్వాత 15ఏళ్ళు పైబడిన పాత వాహనాలకు పెట్రోల్, డీజిల్ పెట్రోల్ కొట్టద్దంటూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటు.. హైరైజ్ బిల్డింగులు, స్టార్ హెూటళ్లు, ఆఫీస్ కాంప్లెక్సులలో యాంటీ స్మాగ్ గన్స్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు మంత్రి మంజిదర్ సిర్సా. పెట్రోల్ బంకులలో 15ఏళ్ళ పైబడిన పాత వాహనాలను గుర్తించేందుకు ప్రత్యేక పరికరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు మంత్రి. అంతే కాకుండా పబ్లిక్ ట్రాన్స్ పోర్టును పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాలకు షిఫ్ట్ చేయనున్నట్లు తెలిపారు మంత్రి సిర్సా.

**డిసెంబర్ 2025 నాటికి 90శాతం సీఎన్జీ**



**బస్సుల నిలిపివేత:**
డిసెంబర్ 2025 నాటికి ఢిల్లీలో దాదాపు 90 శాతం ప్రభుత్వ CNG బస్సులను దశలవారీగా నిలిపివేసి, పరిశుభ్రమైన, స్థిరమైన ప్రజా రవాణా దిశగా అడుగులేస్తున్నామని తెలిపారు మంత్రి. నిలిపివేసిన బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులతో భర్తీ చేస్తామని తెలిపారు. ఢిల్లీ వాసులకు పెద్ద సమస్యగా మారిన వాయు కాలుష్యాన్ని నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు మంత్రి సిర్సా.

క్లౌడ్ సీడింగ్ కోసం అవసరమైన ఏ అనుమతినైనా తీసుకుంటామని.. ఢిల్లీలో కాలుష్యం తీవ్రంగా ఉన్న క్రమంలో క్లౌడ్ సీడింగ్ ద్వారానే వర్షాలు కురుస్తాయని.. తద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చని అన్నారు మంత్రి సిర్సా.

# ఇంకా జనాల వద్ద రూ.2 వేలు కరెన్సీ నోట్లు... ఆర్బీఐ నివేదికలో ఆసక్తికర అంశాలు

- గతంలో రూ.2 వేల నోటు తీసుకువచ్చిన కేంద్రం
- కొంత కాలానికి మార్కెట్ నుంచి ఉపసంహరణ
- ప్రజల వద్ద ఇంకా రూ.6,471 కోట్ల విలువ చేసే రూ.2 వేలు నోట్లు





**హైదరాబాద్ పెన్ పవర్:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజా నివేదికలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. గతంలో కొన్ని రకాల కరెన్సీ నోట్లను రద్దు చేసి, రూ.2 వేల నోటును తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వం... కొన్ని నాళ్లకే రూ.2 వేల నోటును మార్కెట్ నుంచి ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించింది. అయినప్పటికీ, ప్రజల వద్ద ఇంకా రూ.2 వేలు కరెన్సీ నోట్లు ఉన్నాయని ఆర్బీఐ వెల్లడించింది. చలామణిలో ఉన్న రూ.2 వేలు కరెన్సీ నోట్లలో 98.18 శాతం నోట్లు తిరిగి బ్యాంకుల వద్ద చేరినప్పటికీ... ప్రజల వద్ద ఇంకా రూ.6,471 కోట్ల విలువ చేసే రూ.2 వేలు నోట్లు ఉన్నాయని వివరించింది.

కాగా, బ్యాంకులద్వారా రూ.2 వేలు నోట్లను మార్చుకునే వెసులుబాటు 2023 అక్టోబరు 7వ తేదీతో ముగిసింది. ఆ తర్వాత ఆర్బీఐ రీజినల్ ఆఫీసుల్లోనే నోట్ల మార్పిడికి అవకాశం ఇస్తున్నారు. ఇప్పటికీ ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల వద్ద నోట్ల మార్పిడికి, డిపాజిట్ చేసేందుకు అవకాశం ఉందని... తమ కార్యాలయాల వద్దకు రాలేని వారు పోస్టల్ శాఖ ద్వారా కూడా నోట్లను పంపవచ్చని ఆర్బీఐ వెల్లడించింది.

# ముస్లింల పవిత్ర మాసం రంజాన్.....

**నేటి నుండి ఉపవాస దీక్షలు ప్రారంభం....**

**దాన ధర్మాల మాసం రంజాన్...**



**హైదరాబాద్ పెన్ పవర్:**ముస్లింలకు ఎంతో పవిత్రమైన మాసం రంజాన్ మాసం శనివారం నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం ప్రారంభమవుతుంది. ఈనెల 2 వ తేదీ నుండి ఉపవాస దీక్షలు ప్రారంభమవుతాయి. నెలరోజులపాటు ఈ ఉపవాస దీక్షలు కొనసాగిన అనంతరం శవ్వాల్ మాసపు నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం ముగిసిన మరునాడు ఈద్గాకు వెళ్లి ప్రత్యేక ( నమాజ్) ప్రార్థన చేస్తారు. ఈ రంజాన్ నెల

ముస్లీంలకు ఎంతో ప్రత్యేకమైంది. రమదాన్ లేదా రంజాన్ అనేది పండుగ పేరు కాదు. ఇస్లామిక్ క్యాలెండర్లోని 9వ నెలను రంజాన్ మాసం అని అంటారు. ఈ నెలలోనే ముస్లీంల పవిత్రగ్రంథమైన ఖురాన్ స్వర్గం నుంచి భూమికి వచ్చిందని వాళ్లు బలంగా నమ్ముతారు. మానవత్వానికి అద్దంపట్టే ధర్మ సూత్రాలు ఇస్లాంలో ఉన్నాయి. నమాజ్ దగ్గర నుంచి రోజూ అవలంభించే పద్ధతుల వరకు ఎన్నో మంచి విషయాలను ఇస్లాం నుంచి ఆదర్శంగా తీసుకోవచ్చు. ఈ నేపథ్యంలో రంజాన్ మాసం విశిష్టత, ఉపవాస దీక్ష లాంటి అంశాల గురించి ఇప్పుడు చూద్దాం.

**5 ప్రాథమిక విధులు..**

రంజాన్ మాసంలో ప్రపంచంలోని ప్రతి ముస్లీం ఐదు ప్రాతమిక విధులను తప్పనిసరిగా నిర్వర్తించాలి. ఇమాన్, నమాజ్, జకాత్, రోజా, హత్ అనే విధులను విధిగా నిర్వహించాలి.

**ఇమాన్.. భగవంతుడైన అల్లాహ్ పై పూర్తిగా విశ్వాసం ఉంచాలి.**

నమాజ్.. ఎనిమిదేళ్లు దాటిన వారు విధిగా 5 సార్లు నమాజ్ చేయాలి.

రోజా.. ఉపవాసం దీక్ష చేయడం. ఉపవాసాన్ని అరబ్బీలో 'సౌమ్' అని, ఉర్దూ భాషలో 'రోజా' అనీ పిలుస్తారు. ఇస్లాంలో 'రోజా' అంటే ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఆహారపానీయాలు సేవించకుండా మనోవాంఛలకు దూరంగా ఉండడం.

జకాత్ / సద్కా- తమ స్థోమతను బట్టి నిర్దేశించిన స్థాయిలో దానధర్మాలు చేయడం. కనీసం వార్షిక సంపాదనలో 2/5వ వంతు సాయం చేయాలి.

హజ్.. ప్రతి ముస్లిం తమ జీవితంలో ఒక్కసారైనా మక్కాలోని దైవగృహం కాబాను దర్శించాలి.

ఈ ఐదింటిలో మొదటి మూడింటి తప్పనిసరిగా ఆచరించాలి. మిగిలిన రెండింటిన ఆర్థిక స్థోమతను బట్టి పాటించాలి.

**2 హజ్ యాత్ర..**

నిర్దేశిత నియమాలను పాటిస్తూ కాబాను దర్శించి పునీతులు కావడమే హజ్ యాత్ర ఆంతర్యం. అయితే, ఆర్థిక స్థోమత, కుటుంబ బాధ్యతల నుంచి విముక్తలైవారా తమ జీవితకాలంలో ఒకసారైనా హజ్యాత్ర చేయగలగాలి. హజ్ యాత్ర తప్ప మిగతా నాలుగు అంశాలు ప్రతి ముస్లిం తప్పక పాటించాల్సిందే. వీటిలో రోజా రంజాన్ మాసంలో అత్యంత భక్తిక్షిశద్ధలతో పాటించే దీక్ష. ముస్లిం సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరుస్తుంది. రంజాన్ మాసం గురించి దివ్య ఖురాన్ 2-185 అధ్యాయంలో ఇలా తెలిపింది.

ఉపవాస దీక్ష ఎందుకు చేస్తారు..

'పవిత్ర దివ్య ఖురాన్ గ్రంథం అవతరించిన మాసం రంజాన్. మానవులందరికీ ఇది మార్గదర్శకం. రుజు మార్గం చూపి, సత్యాసత్యాలను వేరుచేసే స్పష్టమైన ఉపదేశాలు అందులో ఉన్నాయి కాబట్టి ఆ మాసం అంతా విధిగా ఉపవాస దీక్ష పాటించాలి'. దివ్య ఖురాన్ను అందజేసినందుకు, మహమ్మద్ను ప్రవక్తగా నియమించినందుకు అల్లాహ్కు కృతజ్ఞతను తెలియజేయడానికి ముస్లింలు ఉపవాస దీక్ష పాటిస్తారు. రంజాన్ మాసంలో జకాత్ - సద్కాలు ఎక్కువగా జరుగుతాయి. సహనానికి ప్రతీక రంజాన్ మాసం. దీనికి ప్రతిఫలం స్వర్గం. పరస్పరం సానుభూతి కనబరిచి, ఆగ్రహావేశాలకు లోనుకాకుండా శాంతంగా, దయతో ఉండాల్సిన కాలం.

**ఉపవాస దీక్ష ముఖ్య ఉద్దేశం..**

పవాసదీక్ష అంటే కేవలం ఘన,ద్రవ పదార్థాలకు దూరంగా ఉంటమే కాదు...మన జ్ఞానేంద్రియాలను నియంత్రణలో ఉంచడం. దీక్షలో ఉన్నప్పుడు నోటితో అబద్దాలాడరాదు..చెవుల ద్వారా చెడు వినరాదు...కళ్లతో అశ్లీలం వంటిని చూడరాదు..మనం చేసే ప్రతి

చర్య సన్మార్గంలో ఉండే విధంగా చూడటం..నెల రోజుల పాటు ఇలాంటి కఠోర నిమయం పాటించటం వలన.. ఏడాదిలో మిగిలిన 11 నెలలు పవిత్రమైన జీవినాన్ని కొనసాగించేందుకు ప్రేరణ కలుగుతుంది. తద్వారా ఆధ్యాత్మిక జీవనం కొనసాగించేందుకు మార్గం సుగమం అవుతుంది. నెలలో సూర్యోదయం నుంచి సూర్యుడు అస్తమించే వరకు ఘన, ద్రవ పదార్థాలు తీసుకోకుండా ఉంటారు. దీని వలన స్వయంగా ఆకలి బాధ మనకు తెలుస్తుంది. ఆకలితో అలమటించే పేదవాడి బాధను మనం స్వయంగా అనుభవించడం వలన పేదవాడికి సాయం చేయాలన్న సేవా దృక్పదం మనకు అలవడుతుంది.

రంజాన్.. మానవులకు మార్గదర్శకం.. సత్యాన్ని తెలిపే ఉపదేశం రంజాన్.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఈటెల రాజేందర్..!

**రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు ఉన్న నాయకుడు**

**ఉద్యమ సమయంలో కేసీఆర్ తర్వాత స్థానం**

**బీసీ నాయకుడుగా ప్రతిపక్షాలను ధీటుగా పోరాటం**

**షార్ట్ లిస్ట్ లో ఈటల రాజేందర్, డీకే అరుణ, రామచంద్రరావు**



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ భారతీయ జనతా పార్టీ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక క్లైమాక్స్కి చేరుకుంది. రాష్ట్ర బీజేపీకి కొత్త రథసారథి వస్తారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించడంతో. కౌన్ బనేగా తెలంగాణ బీజేపీ చీఫ్, అంటూ కాషాయ పార్టీలో చర్చనీయాంశంగా మారింది అయితే ఇదే కొశ్చన్ పై గతకొన్ని రోజులుగా పొలిటికల్ సర్కిల్స్లో హాట్ హాట్ డిబేట్స్ నడుస్తున్నాయ్. అయితే టీబీజేపీ అధ్యక్షుడి ఎన్నిక ఆల్ మోస్ట్ క్లైమాక్స్కి చేరుకుంది. షార్ట్ లిస్ట్ సైతం సిద్ధమైనట్లు తెలుస్తోంది. తెలంగాణ బీజేపీ అధ్యక్ష రేసులో ముగ్గురు నేతలు ఉన్నట్లు పేర్కొంటున్నారు. షార్ట్ లిస్ట్లో ఈటల రాజేందర్, డీకే అరుణ, రామచంద్రరావు పేర్లు ఉన్నట్లు సమాచారం.

పార్టీలో మొదట్నుంచి ఉండడం, ఆర్ఎస్ఎస్ మద్దతుతో అధ్యక్ష పదవి కోసం రామచంద్రరావు ప్రయత్నాలు చేస్తున్నారు. సునీల్ బన్సల్, బీఎల్ సంతోష్ సహా ముఖ్యనేతలతో ఇప్పటికే అధ్యక్ష పదవి ఆశిస్తున్న నాయకులు సమావేశమయ్యారు. అయితే హైకమాండ్ మహిళా కోటాలో డీకే అరుణ పేరు పరిశీలిస్తున్నట్లు కూడా చెబుతున్నారు. రెడ్డి సామాజికవర్గ సమీకరణాలు డీకే అరుణకు ప్లస్ పాయింట్స్ గా చెబుతున్నారు. అయితే ముగ్గురిలో రేసులో ఈటల రాజేందర్ ముందున్నట్లు చెబుతున్నారు. తెలంగాణలో బీసీ నినాదం వినిపించేందుకు ఈటల ఆప్షన్ అని సుదీర్ఘ రాజకీయ అనుభవం ఈటలకు ప్లస్ పాయింట్ అవుతుందని చెబతున్నారు. అయితే షార్ట్ లిస్ట్ లో ఉన్న పేర్లను పరిశీలించిన తర్వాత త్వరలోనే కొత్త అధ్యక్షుడిని మోదీ, అమిత్ షా ఫైనల్ చేయనున్నట్లు చెబుతున్నారు.

ప్రస్తుతం తెలంగాణ అధ్యక్షుడిగా ఉన్న కిషన్రెడ్డి ప్లేస్లో గతకొన్ని రోజులుగా చాలా పేర్లే వినిపించాయి. ఈటలతో పాటు ధర్మపురి అర్వింద్, రఘునందన్రావు పేర్లు తెరపైకి వచ్చాయి. కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా ఉంటారనే ప్రచారం కూడా జరిగింది. ఐతే అన్నీ తోసిపుచ్చుతూ ఇప్పుడు 3 పేర్లను షార్ట్లిస్ట్ చేసినట్టు తెలుస్తోంది. ఈటల, డీకే అరుణ, రామచంద్రరావు. ఈ ముగ్గురిలో ఒకరు అధ్యక్ష బాధ్యతలు చేపట్టే ఛాన్స్ ఎక్కువగా కనిపిస్తోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## ఆ ఇళ్లను కూల్చబోం...



హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్‌లోని సున్నం చెరువు తమ్మిడికుంట కూకట్పల్లి నల్లచెరువు ఉప్పల్ నల్ల చెరువు, ఖుర్షుఖ్ ఉద్దీన్ దౌలా చెరువులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. చెరువుల బఫర్ జోన్లలో ఇంటి స్థలాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం టిడిఆర్, కింద సహాయం అందిస్తుందని చెప్పారు. ఇప్పటికే నివాసాలున్న ఇళ్లను కూల్చబోమన్నారు. చెరువుల పరిరక్షణ,పునరుద్ధరణ,సుందరీకరణ పనుల్లో ఎక్కడా నివాసాలను తొలగించమని స్పష్టం చేశారు.

## ప్రధాని మోదీ కి సీఎం రేవంత్ కృతజ్ఞతలు



హైదరాబాద్ పెన్ పవర్: ప్రధాని మోదీకి సీఎం రేవంత్ కృతజ్ఞతలు తెలిపారు తెలంగాణ వరంగల్ మామునూరు విమానాశ్రయానికి అనుమతి మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజల తరపున ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు కూడా సీఎం రేవంత్ ధన్యవాదాలు తెలిపారు. వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే.ఐ

## ఉచిత వాటర్ ప్లాంట్ ను ప్రారంభోత్సవం చేసిన బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

హైదరాబాద్ పెన్ పవర్: బద్వేల్ పట్టణం నెల్లూరు రోడ్డులో వెలసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామన బోయిన పుల్లయ్య సతీమణి కృష్ణమ్మ కుమారుడు మురళి యాదవ్ సునీత సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో మరియు నూతన చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, పట్టణ అధ్యక్షులు వెంగల్ రెడ్డి మిత్తికాల రమణ, మాజీ మున్సిపల్ చైర్మన్ పార్థసారథి, మరియు మున్సిపల్ చైర్మన్ వాకుమల్ల నర్సింహారెడ్డి తోపాటు పలువురు నాయకుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు, ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మరియు పలువురు నాయకులు భక్తులు పాల్గొన్నారు, చలివేంద్రం ప్రారంభోత్సవానికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మతో పాటు పలువురు నాయకులకు ఆలయ ప్రధాన అర్చకులు రమేష్ శర్మ వేదమంత్రాలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి చలివేంద్రం ప్రారంభోత్సవం చేశారు, అనంతరం మురళి యాదవ్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మతో పాటు పలువురు నాయకులను శాలువాతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు, అనంతరం మురళి సేవలను అభినందించారు

# నీటి పారుదల శాఖ మంత్రి కి హరీష్ రావు ఫోన్

హైదరాబాద్ పెన్ పవర్:ఎండిపోతున్న పంటలను కాపాడి రైతులను ఆదుకోవాలి.మిడ్ మానేరు నుండి 1 టి ఎం సీల నీటిని రంగనాయక సాగర్ లోకి ఎత్తి పోయండి.యాసంగి పంట పూర్తి అయ్యేంత వరకు పంట పొలాలకు సాగు నీటిని అందించాలి.రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో ఫోన్ లో కోరిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సిద్దిపేట నియోజకవర్గం లో పంట పొలాలకు సాగునీళ్లు అందుక పంట పొలాలు ఎండి పోతున్నాయని మిడ్ మానేరు నుండి రంగనాయక సాగర్ లోకి నీటిని ఎత్తి పోయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఫోన్ లో మాట్లాడారు. నియోజకవర్గం లో గత నాలుగు సంవత్సరాల నుండి యాసంగి పంటకు నియోజకవర్గ ప్రాంతం లోని రంగనాయక సాగర్ కాల్వల ద్వారా రైతుల పంట పొలాలకు సాగు నీటిని అందిస్తున్నామని. ఈయేటి యాసంగి పంటకాలం పూర్తి అయ్యే వరకు సాగు నీటిని అందించాలని రైతుల పక్షాన ఫోన్ ద్వారా కోరారు. రైతులకు మంచి పంట రాబడి పెరిగింది. రంగనాయక సాగర్ కింద ఇలా ప్రతి



యేటా గణనీయంగా పంట రాబడి పెరుగుతుందన్నారు. ఈ ఏటా 50వేల ఎకరాల పంట ఉన్నదని ఫోన్ లో పేర్కొన్నారు. రంగనాయక సాగర్ లో ఇటీవల మీరు 2.4 టి ఎం సిల నీళ్లు పంపింగ్ చేశారని ప్రస్తుతం రంగనాయక సాగర్ లో 1.5 టీ ఎం సి ల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నాయని చెప్పారు. యాసంగి పంటకు పూర్తి స్థాయిలో నీరు అందాలి అంటే ఇంకా కనీసం 1 టిఎంసి ల నీళ్లు అవసరం ఉన్నాయన్నారు. కావున మిడ్ మానేరు నుండి రంగనాయక సాగర్ లోకి వెంటనే నీళ్లు పంపింగ్ చేయాలనీ ఇరిగేషన్ అధికారులను ఆదేశించగలరని విజ్ఞప్తి చేశారు. రైతులు సాగు నీళ్లు లేక పంటలు ఎండి పోయే పరిస్థితి ఉంది అన్నదాతలు తీవ్ర ఆందోళన లో ఉన్నారని గుర్తు చేసారు. పంటలను కాపాడి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు గత నాలుగు సంవత్సరాల నుండి యాసంగి కి రైతులకు సాగు నీరు అందించినట్టు గా ఈ యాసంగి పంటకాలం పూర్తి అయ్యేఅంత వరకు రైతుల పంట పొలాలకు సాగు నీరు అందించాలని సిద్దిపేట నియోజకవర్గ రైతుల పక్షాన తమరికి విజ్ఞప్తి చేయుచున్నట్లు ఫోన్ ద్వారా కోరారు.

# అప్రమత్తత.. అవగాహన ద్వారా సైబర్ నేరాలను అరికట్టవచ్చు

రాజన్న సిరిసిల్ల: పెన్ పవర్:భయమే పెట్టుబడిగా సాగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి సైబర్ నెరలపై అవగాహన పెంచుకోండి. సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోయారా మీ డబ్బును పోగొట్టుకున్నారా? అయితే వెంటనే 1930 కు కాల్ చేయండి.

జిల్లా ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, భయమే పెట్టుబడిగా సాగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి సైబర్ నెరలపై అవగాహన పెంచుకోవలని , అప్రమత్తత, అవగాహన ద్వారానే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని,సైబర్ నేరం జరిగిన మొదటి గంటలోనే గోల్డెన్ అవర్, ఫిర్యాదు చేయడం ద్వారా స్కామర్ అకౌంట్ ను ఫ్రీజ్ చేసి పోయిన డబ్బు రికవరీ సులభతరమవుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోయారా? మీ డబ్బును పోగొట్టుకున్నారా? అయితే వెంటనే 1930 కు కాల్ చేయాలని లేదా ఇ.ఎవివితీఇతీతిఎవ.ఐనీల.తిని వెబ్ సైట్ లో ఫిర్యాదును నమోదు చేయండం ద్వారా మీ డబ్బును తిరిగి పొందే ఆస్కారం ఉంటుందన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో ఈ వారం రోజుల వ్యవధిలో జరిగిన కొన్ని సైబర్ నేరాలు: చందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితుడు ఒక వాట్సాప్ లో వచ్చిన పార్ట్ టైం జాబ్ అనే ప్రకటన చూసి వాళ్లతో కాంటాక్ట్ కావడం జరిగింది. దానిలో భాగంగా మోసాగల్లు టాస్క్ ల పేరుతో తన వద్దనుండి ఇన్వెస్ట్మెంట్ రూపంలో వారు అమౌంట్ పెట్టుబడి



పెట్టించడం జరిగింది ఆ విధంగా బాధితుడు 65,000 రూపాయలు నష్టపోయారు.

సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితుడు క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెట్టి ఇస్తామని చెప్పి వాట్సప్ లో చాట్ చేయగా, అందులో ఇన్వెస్ట్మెంట్ రూపంలో బాధితులు వద్ద నుండి 50,000 వేల రూపాయలను మోసగించడం జరిగింది.కొనరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితుడు మొబైల్ పోగొట్టుకోవడం జరుగుతుంది. తర్వాత ఆ మొబైల్ ఫోన్ పే నుండి మొబైల్ దొంగిలించిన సస్పెక్ట్ 2,15,000 రూపాయలను వేరే అకౌంట్ లోకి సెండ్ చేసుకోవడం జరుగుతుంది కావున పిన్ నెంబర్ ఈజీ గా ఉంచుకోరాదు.సైబర్ నేరాలకు గురి కాకుండా ఉండాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోవాలి.లోన్ యాప్ లకు దూరంగా ఉండాలి.కస్టమర్ కేర్ నంబర్లను గూగుల్ లో అస్సలు వెతకవద్దు. ఆయా సంస్థల అధికారిక వెబ్ సైట్ నుంచి మాత్రమే కస్టమర్ కేర్ నంబర్లను పొందాలి.అపరిచిత నంబర్ల నుంచి ఫేస్ బుక్, వాట్సాప్ ద్వారా వచ్చే వీడియో కాల్స్ కు స్పందించవద్దు.లాటరీ ఆఫర్లంటూ వచ్చే మెసేజ్ లను నమ్మవద్దు.అన్ వెరిఫైడ్ యాప్స్, వెబ్ సైట్స్ అందించే ప్రకటనలు నమ్మవద్దు. వారిచ్చే మోసపూరిత ఆఫర్లకు స్పందించి మోసపోవద్దు.యాప్స్ లలో ఆర్మీ పొల్జర్లం ఆఫీసర్లం అంటూ ఎవరైన సంప్రదిస్తే నమ్మి మోసపోవద్దు.ఈజీ రిటర్న్స్, కమిషన్ బేస్డ్ సైట్లలో పెట్టుబడి పెట్టవద్దుపాస్వర్డ్, ఓటీపీ, పిన్ లాంటి వివరాలను ఎట్టిపరిస్థితుల్లో ఎవరికీ షేర్ చేయవద్దు.మీకు లాటరీ తగిలిందంటూ ఎవరైనా మెసేజ్ చేసినా, మెయిల్ పంపించినా స్పందించవద్దు.

సైబర్ నేరాలకు గురి అయితే వెంటనే 1930 నంబర్ కు ఫోన్ చేయాలి. లేదా లిలిలి.ఇ.ఎవివితీఇతీతిఎవ.ఐనీల.తిని వెబ్ సైట్లో రిపోర్ట్ చేయాలి.

# తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే మా లక్ష్యం




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే మా లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. హెచ్ఐసీసీలో "ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్ టీసీసీఐ) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన "సమ్మిట్ ఆన్ ఫ్యూచర్ – రెడీ ఇండస్ట్రీ ట్రాన్స్ఫర్మేషన్: ఇన్నోవేటింగ్ ఫర్ గ్రోత్, ఎఫిషియన్సీ అండ్ సెక్యూరిటీ(గ్రోత్ ఎక్స్ 2025)"ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు గారు మాట్లాడుతూ తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే మా లక్ష్యమని..ఇది తేలికైన విషయం కాదు. కానీ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. పరిశ్రమలకు అనుకూలంగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టి ఈ లక్ష్య సాధనలో భాగస్వామ్యం కావాలని పారిశ్రామికవేత్తలను కోరారు.

ఇతర రాష్ట్రాలకు ధీటుగా తెలంగాణ అన్ని రంగాల్లోనూ అభివృద్ధిలో దూసుకుపోతుంది. సాఫ్ట్ వేర్ ఎగుమతుల్లో తెలంగాణ వృద్ధి రేటు 17.98 శాతం కాగా జాతీయ సగటు 8 శాతం మాత్రమే. ఐటీ రంగంలో తెలంగాణ సత్తా ఏంటో చెప్పడానికి ఈ ఒక్కటే చాలూ అన్నారు.

టెక్నాలజీ రోజురోజుకీ కొత్త పుంతలు తొక్కుతోంది. ముఖ్యంగా కృత్రిమ మేధ(ఏఐ) అందుబాటులోకి రావడంతో అన్ని రంగాల్లోనూ అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అలాగే.. అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మన ఆలోచన తీరు మారాలన్నారు. ఈ ఏఐ యుగంలోనూ పాత ఆలోచనలతో.. సాంప్రదాయబద్ధంగా ముందుకెళ్తే మన మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యంగా పరిశ్రమలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పారిశ్రామికవేత్తలూ కొత్తగా ఆలోచించాలన్నారు. ఏఐ, క్వాంటమ్, మెషిన్ లెర్నింగ్ తదితర కొత్త టెక్నాలజీస్ సాయంతో సమాజం ఎదుర్కొంటున్న ఎన్నో సవాళ్లకు పరిష్కారాలను చూపించొచ్చు. ఆ దిశగా ఆవిష్కర్తలు కొత్తగా ఆలోచించాలని కోరుతున్నా. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలకు మా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

ఉపాధి, జీఎస్డీపీలో ఎంఎస్ఎంఈల వాటానే అధికం. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఎంఎస్ఎంఈలు, ఎస్ఎంఈలు మారాలి. లేదంటే రాబోయే రోజుల్లో వీటి మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని,సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏఐ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్ కు హబ్ గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ఏఐ సమ్మిట్ ను విజయవంతంగా నిర్వహించాం. ఎమర్జింగ్ టెక్నాలజీస్ లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం. ఎమర్జింగ్ టెక్నాలజీస్ సాయంతో పౌర సేవలను ప్రజల ముంగిటకు మరింత సమర్థవంతంగా చేర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ఈ సదస్సు నిర్వహణలో ఎఫ్ టీసీసీఐ, టీ ? హబ్, టీ– వర్క్స్, టాస్క్, వీ హబ్, గూగుల్, మైక్రోసాఫ్ట్ తదితర సంస్థలు భాగస్వామ్యమయ్యాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, వీఎస్ఈజడ్(మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) డిప్యూటీ డెవలప్ మెంట్ కమిషనర్ భవాని శ్రీ, ఎఫ్ టీసీసీఐ ప్రెసిడెంట్ డా. సురేష్ కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి లో చదువుకున్న సీఎం రేవంత్ రెడ్డి కి స్వాగతం



**హైదరాబాద్ పెన్ పవర్:** గత నాలుగు సంవత్సరాలుగా అఖిలపక్ష ఐక్యవేదిక బీసీ ఎమ్మెల్యేల విగ్రహాల గురించి, వారి చేసిన సేవల గురించి పోరాటం చేస్తే, ఫలితంగా రేపు వనపర్తికి రాబోతున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభం చేస్తున్న సమీకృత రెసిడెన్షియల్ భవనాలకు జయ రాములు పేరు, 500 పడకల ఆసుపత్రికి డాక్టర్ బాలకృష్ణయ్య పేరు పెట్టడం స్వాగతిస్తున్నాము. ఎమ్మెల్యే మెగా రెడ్డికి కి సీఎం రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఐక్య వేదిక నేతలన్నారు. అయితే మేము నాలుగు సంవత్సరాలుగా ముగ్గురు బీసీ ఎమ్మెల్యేల విగ్రహాల గురించి పోరాటం చేసాము. దాంట్లో డాక్టర్ బాలకిష్టయ్య విగ్రహాన్ని పెట్టడం జరిగింది. జయరాముల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించుకుంటున్నాము. మున్సిపల్ కౌన్సిల్లో తీర్మానం కూడా చేయించాము. కనుక వీటిపై శ్రద్ధ వహించి టౌన్ హాల్లో జయ రాములు విగ్రహాన్ని పెట్టి, టౌన్ హాల్ కూడా జయరాములు పేరు మీదుగా ఓపెన్ చేయాలని కోరుతున్నాము. గతంలో కేంద్రమంత్రి జయపాల్ రెడ్డి జయరాములు పేరు మీద పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్ ను ఓపెన్ చేశారు. ఇప్పుడు వారి పేరు తూడ్చి వేశారు. దాన్ని కూడా పునరుద్దరించాలిని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, టిడిపి రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, సీనియర్ నాయకులు పుట్టపాక బాలు, బీసీ నాయకులు గౌని గాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, శ్రీనివాసులు, పాషా తదితరులు పాల్గొన్నారు.

# "ఢీ' షో డ్యాన్సర్ కల్యాణి ఆత్మహత్య

**ఖమ్మం:** పెన్ పవర్: ఢీ' షో డ్యాన్సర్ కావ్య కల్యాణి(24) ఆత్మహత్య చేసుకుంది. ఖమ్మం జిల్లా పొన్నెకల్లులోని తన ఇంట్లో సూసైడ్ చేసుకుంది. ఆత్మహత్య చేసుకోవడానికి ముందు తన చావుకు అభి కారణమంటూ సెల్ఫీ వీడియో తీసుకుంది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తనని పెళ్లి చేసుకొని తనతో కాపురం చేస్తూ ఇప్పుడు మరో యువతిని పెళ్లి చేసుకుంటున్నట్లు తెలుసుకుని బలన్మరణానికి పాల్పడింది. 5 ఏళ్లుగా కుటుంబ సభ్యులతో నగరంలోని మామిల్లగూడెం లోని సాయిబాబా గుడి సమీపంలో సహజీవనం చేస్తున్నారు. ఇటీవల కాలంలో పొన్నేకలు మకాం మాచర్చారు. అభిలాష్ కు మరో అమ్మాయితో పెళ్లికి కుటుంబ సభ్యులు సిద్ధం అయ్యారు. విషయం తెలుసుకున్న కల్యాణి పొన్నెకల్ లోని అభి ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్ కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది.

## పోలీస్ పెట్రోల్ పంపు ను సందర్శించిన పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ

**హైదరాబాద్ పెన్ పవర్:**పోలీసు కమిషనర్ డా అనురాధ శనివారం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, సిసిఎస్ పోలీస్ స్టేషన్, పోలీస్ కన్వెన్షన్ సెంటర్ నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ పెట్రోల్ పంపు ను సందర్శించారు.

కమిషనర్ మాట్లాడుతూ చుట్టూ పరిసర ప్రాంతాలు పచ్చదనం పరిశుభ్రతతో ఆహ్లాదకరంగా ఉంచుకోవాలి. అధికారులు సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలి. ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని అన్నారు.

త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ సందర్శించి క్రైమ్ చార్ట్, పార్ట్ టు మ్యాప్ తదితర వాటిని పరిశీలించారు. అధికారులు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి క్రైమ్ రేట్ తగ్గించాలని సూచించారు. ఎప్పుడు ప్రజలకు అందు బాటులో ఉండి సేవలందించాలని తెలిపారు. వీపీఓలు వారికి కేటాయించిన గ్రామాలను వారానికి మూడు నాలుగు రోజులు సందర్శించాలని సూచించారు. సైబర్ నేరాలు రోడ్డు ప్రమాదాల, గంజాయి ఇతర మత్తు పదార్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. చుట్టూ పరిసర ప్రాంతాలు ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తరచుగా నమోదవుతున్న కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉన్నందున త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్ మరియు సిబ్బందిని అభినందించారు. చుట్టూ పరిసర ప్రాంతాలలో మరిన్ని చెట్లు పెంచాలని సూచించారు.

సిసిఎస్ పోలీస్ స్టేషన్ ను సందర్శించి సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న దొంగతనాల కేసులను చేదించే విధంగా కృషి చేయాలని సిసిఎస్ ఏసిపి యాదగిరికి మరియు సిబ్బందికి సూచించారు.

పోలీస్ పెట్రోల్ పంపు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఏవైనా చిన్న చిన్న పనులు ఉంటే వెంటనే పూర్తి చెయ్యాలని వెల్ఫేర్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ విష్ణు ప్రసాద్ కు సూచించారు.

పోలీస్ కన్వెన్షన్ సెంటర్ పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రత పచ్చదనంగా ఉన్నందుకు వెల్ఫేర్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ విష్ణు ప్రసాద్ మరియు సిబ్బందిని అభినందించారు. పచ్చదనం గురించి మరిన్ని మొక్కలు నాటాలని నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, సిసిఎస్ ఏసిపి యాదగిరి, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు విష్ణు ప్రసాద్, పూర్ణచందర్, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, సిసిఎస్ పోలీస్ స్టేషన్ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

